ఈనాడు
సిద్దిపేట
బుధవారం అక్టోబరు 9, 2024

చిన్నకోడూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ


చిన్నకోడూరులో బతుకమ్మ ఆడుతున్న శ్రీనిత, మంజుల, రోజాశర్మ, మహిళలు


మాచాపూర్‌లో...


కొండపాకలో బతుకమ్మతో యువతులు

చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక గ్రామీణం: చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో (ఆరు గ్రామాల్లో), నంగునూరు రాజగోపాల్‌పేటలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఇక్కడ ఏడు రోజులకు చేస్తారు. బతుకమ్మలను చౌరస్తాల్లో పెట్టి ఆడిపాడారు. సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, జడ్పీ మాజీ అధ్యక్షురాలు రోజాశర్మ, మున్సిపల్ ఛైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు కొండం వనిత, విజిత పాల్గొన్నారు.

మహాలక్ష్మి నమోస్తుతే



న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్: సిద్దిపేట ఆర్యవైశ్య భవన్‌లో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చింది. నిర్వాహకులు రూ.51 వేల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధ్యక్ష, కార్యదర్శులు అయిత బాల్ రాజేశం, పోశెట్టి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు విద్యాధరిలో అక్షరాభ్యాసాలు


వర్గల్ క్షేత్రంలో సంప్రదాయ నృత్యం

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. ఎంపీ రఘునందన్‌రావు అమ్మవారిని దర్శించుకొని పూజించారు. ఆలయ సముదాయంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన రాధా నృత్య నిలయానికి చెందిన కళాబృందం ప్రదర్శన ఇచ్చింది. బుధవారం అమ్మవారి జన్మదినమైన మూల నక్షత్రం సందర్భంగా విశేష పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు, లక్ష పుష్పార్చన జరగనున్నాయి. పుష్పగిరి, రంగంపేట, శ్రీక్షేత్రం పీఠాధిపతులు విద్యాశంకర భారతి, మాధవానంద సరస్వతి, మధుసూదనానంద సరస్వతి హాజరై అనుగ్రహ భాషణం అందిస్తారు.

కాంగ్రెస్, భారాస బొమ్మాబొరుసు లాంటివి: ఎంపీ


ఎంపీ సమక్షంలో భాజపా లో చేరుతున్న మహేందర్‌గుప్తా

జగదేవపూర్, కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాజెక్టుల నిర్మాణంలో పీకల లోతు వరకు అవినీతిలో కూరుకుపోయిన భారాస 10 ఏళ్లలో ప్రజల విశ్వాసం కోల్పోతే, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక 10 నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కాంగ్రెస్, భారాసలు బొమ్మాబొరుసు లాంటివని వ్యాఖ్యానించారు. జగదేవపూర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో భారాస సీనియర్ నాయకుడు బుద్ధ మహేందర్‌గుప్తా, ఆయన సతీమణి, మాజీ సర్పంచి బుద్ధ జ్యోతి భాజపాలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... దేశంలో భాజపా ప్రభంజనం కొనసాగుతోందని చెప్పారు. త్వరలోనే అగ్రరాజ్యాల జాబితాలో భారత్ చేరనుందని ఎంపీ అన్నారు. విశ్వశాంతి మోదీతోనే సాధ్యం అవుతుందని అనేక దేశాధినేతలు చెబుతున్నారన్నారు. భాజపాలో కష్టపడిన నాయకులకే స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. కొండపాక మండలం మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఎంపీ ప్రత్యేక పూజలు ఆచరించారు. ఎంపీని క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ సత్కరించారు. కార్యక్రమాల్లో మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ, భాజపా మండల అధ్యక్షుడు ఐలయ్య, మేనిఫెస్టో కమిటీ రాష్ట్ర సభ్యుడు కె.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. హరియాణాలో భాజపా హ్యాట్రిక్ విజయం.. జమ్మూ కశ్మీర్‌లో మెరుగైన ఫలితాల సంబరాలను నాయకులు నిర్వహించారు.

బోరు నడవకపోతే పంట బేర్

● గతేడాది కంటే సాగుకు విద్యుత్తు వినియోగం ఎక్కువ

న్యూస్‌టుడే, గజ్వేల్: వాతావరణ పరిస్థితులకు వరి పంట ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వర్షాకాలం సీజన్ దసరా పండుగతో దాదాపు ముగిసిపోనుందని వాతావరణ శాఖ విభాగం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం అక్కడక్కడా అడపాదడపా వానలే కానీ నిరంతరంగా భారీగా కురుస్తున్న దాఖలాలు జిల్లాలో కానరావటం లేదు. మరోవైపు వానకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో 3.68 లక్షల ఎకరాల్లో సాగైన వరి పంట గట్టెక్కేందుకు రైతులు బోరు బావులపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీనికి కరెంటు వినియోగం విపరీతంగా పెరుగుతోంది. గతేడాది ఇదే సీజన్‌తో పోల్చితే వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం సగటున రోజుకు 8 మిలియన్ యూనిట్లు ఉండగా ప్రస్తుతం 9 మిలియన్ యూనిట్లు.. అంటే ఒక మిలియన్ యూనిట్లు ఎక్కువగా వాడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

వ్యవసాయ కనెక్షన్లు - 1,61,000
బోర్లు (అంచనా) - 1,70,000
వ్యవసాయానికి వాడకం - 9 మి.యూ.
మొత్తం కరెంటు ఒక రోజుకు వినియోగం - 13 మి.యూ.
కాలిపోయిన నియంత్రికలు - 350
3,68,000 వరి సాగు (ఎకరాల్లో)
3,02,000 దొడ్డు రకం
66,000 సన్నరకం

అప్పుడు ఆలస్యంతో ఇప్పుడు పొడిగింపు

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. సీజన్ ప్రారంభంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాల ఆలంబనతో కర్షకులు ఎక్కువగా వరి సాగు వైపు మొగ్గు చూపారు. సాధారణంగా వానాకాలం సీజన్‌లో వరి నాట్లు పంద్రాగస్టు వరకు పూర్తయితే నవంబర్ చివరి వారంలో నూర్పిళ్లకొస్తాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు సకాలంలో కురియకపోవటంతో సెప్టెంబరులోనూ నాట్లు వేయాల్సి వచ్చింది. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంట గొలుసు కట్టు దశలో ఉంది. మరికొన్ని చోట్ల కరకు దశలో ఉన్నాయి.


గజ్వేల్ శివారులో బోరు మోటారుతో వరికి నీరు

నియంత్రికలపై అధిక భారం

దొడ్డు రకం పంట నెల ముందు కోతకు వస్తుంది. సన్న రకానిది 180 రోజుల తర్వాతే నూర్పిడి చేయాల్సి వస్తుంది. నవంబరు, డిసెంబరు నెలల వరకూ తడులు అందితేనే పంటలు పూర్తిగా గట్టెక్కుతాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బోర్లు నిరంతరం నడుస్తున్నాయి. సాగుకు విద్యుత్తు డిమాండు పెరిగిపోవటంతో బోరు మోటార్లన్నీ ఒకేసారి నడుపుతున్నారు. కొన్నిచోట్ల అధిక భారం పడి నియంత్రికలు కాలిపోతున్నాయి. వాటిని తీసి, మరమ్మతు చేసి, మార్చే క్రమంలో రోజులు గడుస్తుండటంతో పంట పొలాలు తడారిపోతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. విద్యుత్తు సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఎదగాలంటే.. క్రీడల్లోనూ రాణించాలి: కలెక్టర్

సిద్దిపేటకు చేరిన సీఎం క్రికెట్ కప్ టార్చ్ ర్యాలీ


క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతి పట్టుకొని ర్యాలీలో పాల్గొన్న మనుచౌదరి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉన్నతస్థానానికి ఎదగాలంటే గ్రామీణులు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి క్రీడాకారులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. క్రీడల్లో ఆసక్తి కల్గిన యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం క్రికెట్ కప్-2024 టార్చ్ రిలే ర్యాలీ మంగళవారం రామంచ గ్రామం ద్వారా జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా పట్టణ శివారులోని పెద్దమ్మ దేవాలయం వద్ద కలెక్టర్ టార్చ్ రిలే ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాజ్యోతి పరుగులో ఆయన పాల్గొన్నారు. పాత డీఈవో కార్యాలయం మీదుగా లఘు క్రీడామైదానానికి ర్యాలీ చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీఎం క్రికెట్ కప్‌లో గ్రామీణ క్రీడాకారులను భాగస్వాములను చేయటమే లక్ష్యమన్నారు. జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ్ ఆర్య, మేనేజర్ వెంకటేశ్వర్ గౌడ్, క్రీడాసంఘాల ప్రతినిధులు, శిక్షకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సిద్దిపేట అర్బన్: 33కేవీ విద్యుత్తు లైన్లను అనుకొని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్, గణేశ్‌నగర్, శ్రీనగర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, హరిప్రియనగర్, టీచర్స్ కాలనీ, కొత్త బస్టాండు, ఎన్సాన్‌పల్లి, ప్రభుత్వ వైద్య కళాశాల, డీఎక్స్ఎన్ పరిశ్రమ, మిట్టపల్లి, ఎల్లుపల్లిలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ మహేశ్‌కుమార్ తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిర్దేశిత స్థానాలను ఖాళీలుగా ప్రదర్శించండి


డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: జూన్ నెలలో బదిలీ అయిన ఎస్జీటీలు దాదాపు 150 మంది పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని, ప్రస్తుతం ఉపాధ్యాయ నూతన నియామకాలు చేపట్టిన క్రమంలో నిర్దేశిత స్థానాలను ఖాళీలుగా ప్రదర్శించి అనుగుణంగా భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సిద్దిపేట కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

‘తెలంగాణ బతుకుబండి పట్టాలు తప్పింది’


హరీశ్‌రావుకు సమస్యలు వివరిస్తున్న ఆశాలు

సిద్దిపేట, న్యూస్‌టుడే: తెలంగాణలో రాజకీయ భాష కట్టుతప్పిందని, పరిపాలన గాడిలో పడలేదని.. అవినీతి పెచ్చుమీరుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలో మొత్తంగా తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పిందని విమర్శించారు. సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులపాలయ్యారు. బతుకమ్మ పండుగ వేళ రేవంత్‌రెడ్డి పాలనలో అనేక వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నారు. ఆశా, అంగన్‌వాడీలు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు, రెండో ఏఎన్ఎంలు, తాత్కాలిక, అతిథి అధ్యాపకులకు వేతనాలు రాక వస్త్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. వసతిగృహాల్లో పని చేసే వంట కార్మికులకు ఆరు నెలలుగా, పాఠశాలల్లో 9, 10 తరగతులకు వండే మధ్యాహ్న భోజన కార్మికులకు మార్చి నుంచి వేతనాలు, బిల్లులు రావడం లేదు.

రూ.4 వేల పింఛన్ ఇవ్వాలి..

‘ఆసరా పింఛనుదారులకు రెండు నెలలుగా సొమ్ము రావడం లేదు. రూ.4 వేలు పక్కన పెడితే ఇచ్చే రూ.2 వేలు కూడా సరిగా రావడం లేదు. పేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఇతర వర్గాలపై ప్రభుత్వం కఠినంగా ఉంటోంది. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం పింఛను ఇవ్వకపోవడం శోచనీయం. వెంటనే బకాయిలు విడుదల చేయడంతో పాటు రూ.4 వేల పింఛనును దసరా కానుకగా అమలు చేయాలి’ అన్నారు.

● పండుగ వేళ సరైన సమయాల్లో వేతనాలు అందటం లేదని ఆశా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను వెళ్లబోసుకుందామని మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన వారికి అదే సమయంలో నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌తో చర్చించడానికి వచ్చిన ఎమ్మెల్యే హరీశ్‌రావు తారాస పడ్డారు. ఆయన వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. వినతిపత్రాన్ని హరీశ్‌రావుకు అందజేశారు.

లోపల మాతానుగ్రహం.. బయట ఫ్లెక్సీ దర్శనం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేర్యాలలోని ‘దేవి స్నేహ యూత్’ ప్రతినిధులు ప్రజలను అప్రమత్తం చేసేలా, సూచనలిచ్చేలా, అవగాహన కల్పించేలా అమ్మవారి మండపాన్ని అలంకరించారు. స్త్రీలు గౌరవం, మత్తు పదార్థాల నిషేధం, సైబర్ నేరాలు తదితర అంశాలను ఫ్లెక్సీలో చిత్రాలు సహితంగా మండపం ముందు ఏర్పాటు చేశారు. అక్కడికి విచ్చేసిన భక్తులంతా ఫ్లెక్సీలోని అంశాలు తెలుసుకుంటున్నారు. వారి స్ఫూర్తిదాయక ఆధ్యాత్మికతను చూసి పట్టణవాసులు అభినందిస్తున్నారు.

- న్యూస్‌టుడే, చేర్యాల

‘సరస్వతి’ అనుగ్రహప్రాప్తిరస్తు



నేటికాలంలో విద్యాభ్యాసం చాలా ముఖ్యం. సెలవుల్లో తల్లిదండ్రులకు వృత్తిపరంగా చేదోడువాదోడుగా విద్యార్థులు నిలిచినా.. కాస్త సమయం దొరికితే చదువుకోవడమో, రాసుకోవడమో చేస్తేనే పురోగతి. నంగునూరు మండలం రాంపూర్ చెందిన పద్మ సీతాఫలాలు తెచ్చి రహదారి పక్కన అమ్ముతున్నారు. ఆమె భర్త ఆటో డ్రైవర్‌గా చేస్తున్నారు. తన పిల్లలను, బావ కుమార్తెను వెంట తీసుకొచ్చారు. ఆ పిల్లలు రహదారి పక్కన వెంట తెచ్చుకున్న పుస్తకాలను తెరిచి సమయం వృథా కాకుండా చదువుకోవడం విశేషం. - న్యూస్‌టుడే, నంగునూరు

నేరాలకు ఆదిలోనే అడ్డుకట్ట

కమ్యూనిటీ అనుసంధాన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

న్యూస్‌టుడే, సిద్దిపేట: ప్రజలకు భద్రతా భావం కల్పిస్తూ.. మేమున్నామనే భరోసా ఇవ్వడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకం. అందుకు వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక దశలోనే నేరాలను కట్టడి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. అనుమానితులపై నిఘా కొనసాగిస్తున్నారు. ప్రజల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక అనుసంధానం (కమ్యూనిటీ కాంటాక్టు) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

జిల్లాలో ఠాణాలు 27 కొనసాగుతున్నాయి. 1200 మందికి పైగా పోలీసులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్తగా ఏర్పడుతున్న వివిధ కాలనీలు (మాస్ ఏరియా), ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వలస వచ్చి నివసించే చోట్లను ప్రత్యేకంగా ఎంచుకునే పోలీసు బృందాలు అప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు. గత ఏడాది వరకు కట్టడి ముట్టడి చేయగా.. ఈ ఏడాది ఆరంభంలో ఆ పేరును కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంగా మార్చి నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాదిలో ...

నిర్వహించిన కార్యక్రమాలు - 12
సీజ్ చేసిన వాహనాలు - 905
గంజాయి స్వాధీనం - 1.5 కిలోలు
గంజాయి కేసులు - 8

భద్రతా సేవలు ఇలా

● ధ్రువపత్రాలు లేని వాహనాల స్వాధీనం ● మద్యం గొలుసు దుకాణాల కట్టడి
● జాగిలాలతో గంజాయి, మత్తు పదార్థాల నిల్వల గుర్తింపు
● నార్కోటిక్ కిట్ ద్వారా గంజాయి పీల్చిన వారిని గుర్తించడం
● నేరస్థులు, పాత నేరస్థులను వేలిముద్రల పరికరంతో పట్టుకోవడం
● స్థానికంగా ఆశ్రయం పొందే ఇతర ప్రాంతాల నిందితులపై నిఘా ● ముఖ గుర్తింపు పరికరాల వ్యవస్థతో అనుమానితుల తనిఖీ ● సైబర్ నేరాల తీరు, రహదారి నిబంధనలపై అవగాహన ● డయల్ 100, పోలీసు అనుబంధ సేవలపై ప్రచారం

ప్రశాంత వాతావరణమే లక్ష్యంగా:



నేరాలను ప్రాథమిక దశలోనే కట్టడి చేయడంతో పాటు ప్రజల్లో భద్రత కల్పించేందుకు కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు దోహదం చేస్తోంది. అంతిమంగా ప్రజలకు ప్రశాంత వాతావరణంలో సేవలు అందించడమే మా లక్ష్యం.

అనూరాధ, పోలీసు కమిషనర్ (సిద్దిపేట)

రేషన్ బియ్యం పట్టివేత

నంగునూరు, కోహెడ: అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రాజగోపాలపేట ఎస్సై ఎండీ ఆసిఫ్ తెలిపారు. మండల పరిధి ఖాతా గ్రామంలో మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలానికి చెందిన భూక్య శ్రీను, మాడోతు శ్రీను అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు ఆరా తీయగా ఇద్దరు కలిసి గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి ట్రాలీ ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని తేలింది. పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కోహెడ మండలం నాగసముద్రాలలో పర్వతం సారయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెదక్, న్యూస్‌టుడే: ప్రతి రెండు, మూణ్నెళ్లకోసారి ఉద్యోగ సంఘాలతో గ్రీవెన్స్ సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగులు, పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్యాంసుందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని వేడుక మందిరంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీరాంకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెండేళ్లుగా నిధులు రావడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణకు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజిరెడ్డి, విజయేందర్, మదన్ మోహన్, నరేందర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, షఫి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రావు, మేరీ, లిల్లీ గ్రేస్ పాల్గొన్నారు.

లాభాల డ్రాగన్

32 రకాల ప్రదర్శన ● సాగుకు ప్రోత్సాహం


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉద్యానశాఖ అధికారులు, రైతులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ



డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువ, ధర ఎక్కువ కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు సంగారెడ్డిలోని డా.కొండా లక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధన కేంద్రం శ్రీకారం చుట్టింది. మంగళవారం డ్రాగన్ ఫ్రూట్ మేళా నిర్వహించి అవగాహన కల్పించింది. మేళాలో 32 రకాలు ప్రదర్శించారు. రెడ్ స్కిన్‌డ్, రాయల్ పింక్, బ్లడ్‌మారి, మిస్టర్‌వో తదితర రకాలున్నాయి.

5వేల ఎకరాల్లో సాగు లక్ష్యం..

సంగారెడ్డి జిల్లాలో డ్రాగన్ సాగుకు మంచి అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సంగారెడ్డి, కొండాపూర్, జహీరాబాద్‌లో 142 ఎకరాల్లో పండిస్తున్నారు. మేళాలో పలువురు రైతులు వారి అనుభవాలు వివరించారు. జిల్లాలో తొలుత 5వేల ఎకరాల్లో సాగు చేసేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



రైతులకు అవగాహన కల్పించేందుకే..

– నీరజ ప్రభాకర్, ఉపకులపతి, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

మార్కెట్లో పండు ధరలు ఎక్కువగా ఉన్నాయి. సామాన్యులకు అందుబాటులోకి రావాలంటే జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగాలి. ఈ ఉద్దేశంతోనే ఫల పరిశోధన కేంద్రంలో మేళా నిర్వహించాం. రైతులు అనుభవాలు వివరించారు. చక్కెర శాతం తక్కువగా ఉండడంతో మధుమేహులూ తినొచ్చు.

ఎకరాకు పది లక్షల పండ్లు

– డా.హరికాంత్, సీనియర్ శాస్త్రవేత్త, ఎఫ్ఆర్ఎస్

పంటపై రైతులకు ఇప్పుడిప్పుడే అవగాహన కలుగుతోంది. జిల్లాలో 150 ఎకరాల్లో డ్రాగన్ పంట సాగవుతోంది. ఒక్కో పండు రూ.100- 150 ఉంటుంది. జూన్- ఆగస్టు మధ్యలో దిగుబడి వస్తుంది. ఎకరాకు 10 లక్షల పండ్లు పండించొచ్చు. పంట ఎలా సాగు చేయాలో రైతులకు వివరించాం.

పాడైనా నష్టం లేదు..

డ్రాగన్ పండ్లు విక్రయం కాకున్నా పారేయాల్సిన అవసరం లేదు. పాడైన వాటితోనూ వివిధ రకాల వస్తువులు తయారు చేయొచ్చని ప్రదర్శనలో చూయించారు. సబ్బులు, పాపడ్, గుల్మన్, క్యాండి, లిప్ బామ్, చిప్స్‌ను ఎలా తయారు చేయొచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు.


మేళాలో ప్రదర్శించిన ఉద్యాన పంటల విలువ ఆధారిత వస్తువులు

65 రకాలు పండించా..



65 రకాల పండ్లు పండించా. ఏడాదిపాటు కష్టపడితే రెండేళ్ల తరవాత కోతకు వస్తుంది. పెట్టుబడికి రెండింతల లాభాలొస్తాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అధికారులు ప్రోత్సహిస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– రమేశ్‌రెడ్డి, రైతు, రంజోల్, జహీరాబాద్

అవగాహన కల్పించారు.. ఇక సాగు చేస్తా..



ఇప్పటి వరకు ఎన్నో పంటలు సాగు చేశా. పెట్టుబడి ఎక్కువగా పెడుతున్నా ఆశించిన లాభాలు మాత్రం రావడం లేదు. మేళాకు రావడంతో డ్రాగన్ ఎలా సాగు చేయాలో తెలుసుకున్నా. ఈసారి పండించాలని నిర్ణయించుకున్నా.

– విశ్వప్రసాద్, రైతు, మారేపల్లి

గతేడాది రూ.7 లక్షల ఆదాయం



మూడేళ్లుగా రెండెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్నా. ఎకరాకు రూ.3.50 లక్షల పెట్టుబడి పెట్టా. గతేడాది రూ.7 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.12 లక్షలు ఆర్జించా. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అన్నదాతలను ప్రోత్సహించాలి.

– మదన్ మోహన్‌రెడ్డి, రైతు, తెర్పోల్


పతకాలు, ప్రశంసాపత్రాలతో మెదక్ జట్టు క్రీడాకారిణులు, అదనపు పాలనాధికారి వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ మెదక్


ఫైనల్‌లో తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారిణులు

మెదక్ టౌన్: పాఠశాల క్రీడ సమైఖ్య(ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలికల ఛాంపియన్‌గా మెదక్ జట్టు నిలిచింది. గత మూడు రోజుల నుంచి మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో కొనసాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. లీగ్ దశ నుంచి అత్యంత ప్రతిభ కనబర్చిన మెదక్, రంగారెడ్డి జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించాయి. రంగారెడ్డి-1, మెదక్-2 పాయింట్లు సాధించడంతో ఛాంపియన్‌గా ప్రకటించారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

క్రీడలపై దృష్టి పెట్టి రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... మెదక్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, నిజామాబాద్ తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. పోటీల కోఆర్డినేటర్ నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, పీడీలు ప్రతాప్‌సింగ్, మాధవరెడ్డి, రవి, సత్యం పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా చదువుల తల్లి


ప్రసిద్ధ వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం విద్యా సరస్వతి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- న్యూస్‌టుడే, వర్గల్

కమనీయ రూపం.. కాత్యాయనీ అవతారం


వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయంలో మంగళవారం అమ్మవారు కాత్యాయనీ దేవిగా (గాయత్రీ దేవి)గా దర్శనమిచ్చారు. అమ్మ రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు.

- న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ

రాష్ట్ర స్థాయి ఖోఖో బాలికల జట్ల ఎంపికలు



నర్సాపూర్: నర్సాపూర్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఖేలో ఇండియా ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. రెండు విభాగాల్లో అయిదుగురు చొప్పున ఎంపిక చేశారు. వారు ఈనెల 9వ తేదీన నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు, నర్సాపూర్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ శ్రీకాంత్‌గౌడ్ సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించారు.

చేతివృత్తులకు పునరుజ్జీవం

పీఎం విశ్వకర్మ పథకంతో స్వయం ఉపాధికి భరోసా

న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

పోటీ ప్రపంచంలో గ్రామీణ వడ్రంగులు తయారు చేసే సాంప్రదాయ వస్తువులకు విపణిలో ఆదరణ కరవై అనేక మంది వృత్తిని వదిలేసి ఇతర రంగాల వైపు వెళుతున్నారు. యంత్రాలతో పోటీపడలేక గ్రామీణ పేద విశ్వకర్మలు నిత్యం జీవనపోదికి కూలీ, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారికి ఉచితంగా ఆధునాతన నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించేందుకు అందుబాటులోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ పథకమే పీఎం విశ్వకర్మ.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు..

ఈ పథకంలో దాదాపు 18 రకాల సాంప్రదాయ కళాకారులు, చేతివృత్తుల వారికి ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించి వారి స్వయం ఉపాధి పొందేలా కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత శాఖ అధికారులు కొందర్ని ఎంపిక చేస్తారు. వారిని బృందాలుగా విభజించి స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు పంపుతారు. అక్కడ శిక్షకులు అయిదు రోజులపాటు పాఠాలు బోధించడంతోపాటు అధునాతన నైపుణ్య శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రయాణభత్యంతోపాటు రోజుకు రూ.500 చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం విశ్వకర్మ శిక్షణకు ఎంపికైన 33 మంది మొదటి బ్యాచ్ అభ్యర్థులకు అధునాతన వడ్రంగి నైపుణ్య శిక్షణ విజయవంతంగా పూర్తయింది. మరో బ్యాచ్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. పీఎం విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే రూ.15 వేల టూల్ కిట్ అందించి, సొంతంగా వ్యాపారం చేసుకోవాలని భావిస్తే పీఎం విశ్వకర్మ ప్రయోజకుల ఆధారంగా రూ.1- 3 లక్షల వరకు బ్యాంకుల లోన్ సదుపాయం కల్పించనున్నారు. దీంతో విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపే ఉద్దేశంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడనుంది.


కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శిక్షణ

సద్వినియోగం చేసుకోండి..

-వెంకటరమణ, ప్రిన్సిపల్, ఐటీఐ కళాశాల, కుకునూరుపల్లి

పీఎం విశ్వకర్మ శిక్షణతో స్వయం ఉపాధితో స్థిరపడాలనుకుంటున్న వారికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పీఎం విశ్వకర్మ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకుల రుణ సదుపాయం కల్పిస్తాం.


తయారు చేసిన కళాకృతులు

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంలో నిజాం కాలంలో నిర్మించిన చెరువు, పరిసరాలు ప్రజలకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఈ చెరువును 1891లో నిర్మించారు. నిండుగా, అందమైన పరిసరాలతో కూడిన ఈ ప్రాంతానికి చుట్టుపక్కల మండలాల ప్రజలు సెలవు రోజుల్లో వస్తుంటారు. ఇది 5,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తోంది.

– న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం


కొండల మధ్య చెరువు.. ఆహ్లాదానికి నెలవు

చారిత్రక వైభవం.. భవానీమాత ఆలయం



ఆలయంలో కొలువైన అమ్మవారు

న్యూస్‌టుడే, జహీరాబాద్: దసరా అంటేనే నవరాత్రులు గుర్తుకొస్తాయి. అమ్మవారిని పూజించటం ఈ పండగ ప్రత్యేకత. తుల్జాభవానీ అమ్మవారు వెలిసిన ఆలయం అనగానే మహారాష్ట్రలోని తుల్జాపూర్ అని అందరికీ తెలుసు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్‌జమాల్‌పూర్(భవానమ్మపల్లె)లో కొలువైన తుల్జాభవానీ మాత ఆలయానికీ అంతటి చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామంలో దాదాపు 800 ఏళ్ల కిందట ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు తెలిపారు. యుద్ధానికి వెళుతూ జహీరాబాద్‌కు 15 కి.మీ. దూరంలోని ఖాన్‌జమాల్‌పూర్‌లో సేదతీరారని, విజేతగా వస్తే అమ్మవారి ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారని చరిత్ర చెబుతోంది. ఆయన విజయం సాధించాక ఆలయం నిర్మించారని తెలుస్తోంది.

చెక్కుచెదరని మెట్ల బావి..: ఆలయం చుట్టూ ప్రహరీ, కొంత దూరంలో కందకం, ప్రధాన ద్వారం నిర్మించారు. ఆలయం పక్కనుంచి లోతైన సొరంగ మార్గమున్న ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. గుడి పక్కనే ఎర్రరాయితో నిర్మించిన మెట్ల బావి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. శిథిలావస్థకు చేరుతున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలతోపాటు దసరా, దీపావళి, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులు వస్తుండటంతో ఏడాదిపాటు ఆలయం సందడిగా మారుతోంది. దసరా పండగకు భక్తులు భారీగా తరలి రానుండడంతో ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

12 ఏళ్లుగా పాదయాత్ర..: ఛత్రపతి శివాజీ నిర్మించిన ఆలయ ప్రాధాన్యాన్ని వివరించేందుకు 12 ఏళ్లుగా ఈ ప్రాంతంలోని యువకులు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన యువకులు పదుల సంఖ్యలో పాల్గొని ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పురాతన భవానీమాత ఆలయం నుంచి ఖాన్‌జమాల్‌పూర్ భవానమ్మపల్లె వరకు పాదయాత్ర చేస్తుంటారు. ఈనెల 10న ఉదయం పాదయాత్రకు ఏర్పాట్లు చేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై ప్రచార కార్యక్రమాలు


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బాధ్యులు

మెదక్, న్యూస్‌టుడే: గ్రామాల్లో కులాల మధ్య ఆధిపత్య పోరు సమాజంలో అంతరాలు పెంచేలా ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలిమెల రాజేశ్వర్ అన్నారు. మంగళవారం వేదిక బాధ్యులు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాల కంటే మారుమూల పల్లెల్లో మూఢనమ్మకాలు అధికంగా ఉన్నాయన్నారు. రామాయంపేట మండలం క్యాత్రియాల్‌లో ఇటీవల దాయాదుల మధ్య నెలకొన్న గొడవల కారణంగా ముత్తవ్వను సజీవ దహనం చేశారన్నారు. ఈ ఘటనపై డీజీపీని కలిశామని, ఆయన సూచన మేరకు దసరా తర్వాత జిల్లాలో పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూఢ నమ్మకాలను నిర్మూలించేలా ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర బాధ్యులు పద్మ, మహేందర్, వెంకట్ రమణారెడ్డి, పాల్‌రాజ్, వరప్రసాద్, నాగభూషణం, జిల్లా కార్యదర్శి దేవ్లా పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు లింగమయ్యగౌడ్ మృతి



జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తామరపత్ర గ్రహీత గడీండ్ల లింగమయ్యగౌడ్ (96) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఆయన జైలుపాలయ్యారు. కర్ణాటక గుల్బర్గా జైలులో 25 రోజులున్నారు. 50 ఏళ్ల స్వాతంత్య్ర వేడుకల్లో అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ చేతుల మీదుగా రాష్ట్రపతి భవనంలో సత్కారం పొందారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. బ్రాహ్మణపల్లికి చెందిన గుండే కరుణాకర్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాది క్రితం పెద్దకూతురు వివాహం చేశాడు. పెళ్లికి అయిన అప్పు ఎలా తీర్చాలని తరచూ ఆవేదన చెందేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లలు వచ్చేసరికి చనిపోయాడు. భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

మద్యం మత్తులో మరొకరు...

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో అద్దెకు ఉంటున్న దీపల్లి నరేందర్‌రెడ్డి(27) సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా మేడికొండకు చెందిన దీపల్లి నరేంద్రరెడ్డి మూడేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని ఏడాదిన్నరగా టీచర్స్ కాలనీలో ఉంటున్నట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మద్యం మత్తులో ఉరేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వికారాబాద్ నుంచి వచ్చాక వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

స్తంభానికి కట్టేసి కొట్టారని ఏడుగురిపై కేసు



శివ్వంపేట, న్యూస్‌టుడే: వ్యక్తిని స్తంభానికి కట్టేసి దాడి చేసిన ఏడుగురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణ ఈనెల 1న తను స్నానాల గదిలో ఉండగా చూశాడని ఓ మహిళ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మరుసటి రోజు ఇంట్లో పడుకొని ఉండగా మహిళ కుటుంబ సభ్యులు బయటికి లాక్కొచ్చి స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టారని కృష్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మహిళతో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

సంచికి దూరం.. సృజనకు చేరువ

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో సంచికి దూరం కార్యక్రమం మంగళవారం ముగిసిందని, పిల్లల్లో సృజనాత్మకత పెంచడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించామని ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగులద్దడం, ముగ్గులు వేయడం, క్రీడలు, సంచుల తయారీ, కుట్టు మిషన్ లో మెలకువలు, నర్సరీలో మొక్కలు పెంచడం, కూరగాయల సాగు, వీణ, వయోలిన్ వాయించడం, తదితర అంశాల్లో మెలకువలు నేర్పించామన్నారు. విద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయినాథ్ రెడ్డి పలు సూచనలిచ్చారు.


ఫ్లూట్, వయోలిన్ వాయిస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజేందర్, ఉపాధ్యాయ బృందం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో ఆరుగురు ● నాలుగేళ్లుగా 36 చోరీలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీలు శ్రీనివాస్, నర్సింహ

మాదాపూర్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు పట్టుబడింది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు సంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో 36 చోరీలకు పాల్పడిన రెండు ముఠాలకు చెందిన ఆరుగురు ఘరానా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఆరు కత్తులతోపాటు కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డీసీపీ నర్సింహ తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కుక్షి తహసీల్‌లోని ఖనియాంబకు చెందిన కరన్ మనోహర్‌బాబర్, ప్యారసింగ్ బవుల, డెబ్రాబవుల, కడక్‌సింగ్, చిరాడ్‌కు చెందిన ఠాకూర్ ఈడియ, కుమన్ ఈడియ జల్సాలకు అలవాటుపడి చోరీల బాటపట్టారు. కరన్ మనోహర్‌బాబర్, కడక్‌సింగ్ నేతృత్వంలో రెండు ముఠాలుగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్నారు.

ఆయుధాలతో సంచరిస్తూ..

గతనెల 19, 20, 21వ తేదీల్లో మియాపూర్, బాచుపల్లి, సూరారం, పేట్‌బషీరాబాద్ ఠాణాల పరిధుల్లో చోరీలకు పాల్పడ్డారు. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్ మాదాపూర్, సీసీఎస్ బాలానగర్ జోన్ బృందం పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. సోమవారం కరన్ మనోహర్‌బాబర్ బృందంతో కలిసి మియాపూర్‌లో ఆయుధాలు, కట్టర్లున్న సంచులతో సంచరిస్తూ పట్టుబడ్డారు. కడక్‌సింగ్ ముఠా వివరాలు చెప్పడంతో పోలీసులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు.

మరో 8 మంది పరారీ..

రెండు ముఠాలకు చెందిన సమర్‌సింగ్, మోహన్, అర్జున్, దయాసింగ్, కైలాష్, భురియా, సొత్తు కొంటున్న రోహిత్‌సోని, గౌరవ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

గుంతలో పడి వ్యక్తి మృతి


లక్ష్మయ్య

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండా గ్రామ పంచాయతీ మొండితండా వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గ్రామానికి చెందిన చీమల లక్ష్మయ్య(49) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. మొండితండా వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయాడు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌నాయక్ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబీకులు వచ్చి లక్ష్మయ్యను ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు నవీన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. లక్ష్మయ్యకు భార్య భూదెమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

రాయపోల్, న్యూస్‌టుడే: బైక్‌పై వెనుక కూర్చున్న మహిళ రోడ్డుపై పడగా.. ఆమె పైనుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాలు... గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన రాసమల్ల సూరమ్మ (60) వారి వియ్యంకుడి మూడో రోజు కర్మ కార్యక్రమంలో పాల్గొనడానికి రాయపోల్ వెళ్లింది. తర్వాత రాత్రి జాలిగామకు చెందిన రమేశ్ బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె కింద పడింది. అదే సమయంలో వచ్చిన గుర్తు తెలియని వాహనం పైనుంచి వెళ్లగా తీవ్రగాయాలతో చనిపోయింది. ఆమె భర్త రాములు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



ప్రభుత్వాసుపత్రి వద్ద రోగులకు అల్పాహారం వడ్డిస్తున్న ఛైర్మన్ రాజమౌళి

గజ్వేల్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి అన్నారు. గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ శిబిరం మంగళవారం 100వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు దవాఖానాలో రోగులకు, వారి బంధువులకు ఉచితంగా అల్పాహారం అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, సంతోష్, శ్రీనివాస్, రాధాకృష్ణ, సంజయ్ గుప్తా, మల్లేశం గౌడ్, పరమేశ్వర చారి, రావికంటి చంద్ర శేఖర్, సత్యనారాయణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం అమలుకు కృషి



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ

ములుగు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ అన్నారు. మంగళవారం మార్కుక్‌లో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా, 2003 డీఎస్సీ కొలువు పొందిన ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కూచిరెడ్డి, నరసింహులు, రామకృష్ణా రెడ్డి, పాలుట్ల, రజిత, శ్రీనివాస్, యాదిరెడ్డి, గణేష్, శ్రీధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనో ప్రగతి.. చిన్నారుల్లో ఉన్నతి

న్యూస్‌టుడే, మిరుదొడ్డి: శారీరక, మానసిక దివ్యాంగుల్లో మార్పు తీసుకొచ్చి వారి పనులన్నీ వారే స్వయంగా చేసుకునేలా తోడ్పాటు అందిస్తోంది మిరుదొడ్డిలోని మనో ప్రగతి కేంద్రం. బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపుతూ వారి ఉన్నతికి తోడ్పడుతోంది. డీఆర్డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో మిరుదొడ్డి స్త్రీశక్తి భవనంలో 15 ఏళ్లుగా మనోప్రగతి కేంద్రం కొనసాగుతోంది. ఇక్కడికి మిరుదొడ్డి, మోతె, కాసులాబాద్, రుద్రారం, భూంపల్లి, అల్వాల, పెద్ద చెప్యాల, ధర్మారం, కొండాపూర్ గ్రామాలకు చెందిన వారికి ఇక్కడ సేవలు అందిస్తారు. ఈ గ్రామాల్లో మొత్తం 126 మంది బాధితులు ఉంటే ప్రతిరోజు 35 మంది రోజు హాజరవుతున్నారు.



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

నిర్వహణకు నిధులు

మహిళా సంఘం సభ్యులు పొదుపు చేసుకున్న వాటాల్లోంచి 2 శాతం కేంద్రం నిర్వహణకు వెచ్చిస్తున్నారు. బాధితులు వ్యక్తిగత అవసరాలకు తల్లిదండ్రులపై ఆధారపడుతున్న వారికి ఇక్కడ తర్ఫీదు ఇస్తున్నారు. బుద్ధిమాంద్యం, మూగ, వినికిడి లోపం, పక్షవాతం, శారీరక వైకల్యం సమస్యలతో బాధపడుతున్న వారిని సాధారణ మనుషుల్లా మార్చేలా, వ్యక్తిగత పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇస్తారు.

సొంత పనులు చేసుకుంటూ..

మండల పరిధిలోని అల్వాలకు చెందిన రమేష్, కవిత దంపతులకు మొదటి సంతానం రాజుకు పదేళ్లు. పోషకాహార లోపంతో జన్మించడంతో కాళ్లు, చేతులు పనిచేయలేదు. మాటలు రావు. వ్యక్తిగత అవసరాలన్నీ తల్లిదండ్రులు చూసేవారు. మనోప్రగతి కేంద్రంలో చేర్పించాక కాళ్లు చాపడం, మడవడం,

దివ్యాంగులకు వరంగా మారిన కేంద్రం

లేవడం, కూర్చోవడం, నడవడం చేస్తున్నాడు. కూరగాయల పేర్లు చెప్పడం, తల్లి, తండ్రి, అక్క, అన్న, తాత, అవ్వ అని పలకడం నేర్చుకున్నాడు.

విలువైన సేవలు అందిస్తున్నాం

–డాకయ్య, ఐకేపీ ఏపీఎం, మిరుదొడ్డి

మనోప్రగతి కేంద్రం మానసిక, శారీరక దివ్యాంగులైన చిన్నారులకు విలువైన సేవలు అందిస్తున్నాం. వారి ఉన్నతికి కృషి చేస్తున్నాం. దీర్ఘకాలిక సేవలు అందించి మామూలు స్థితికి వచ్చేలా చూస్తున్నాం. ఇప్పటికే చాలా మంది సాధారణ స్థితికి చేరుకున్నారు.

మూడు రకాల సేవలు

- మనో ప్రగతి కేంద్రం ద్వారా దివ్యాంగులకు మూడు రకాల సేవలు అందిస్తున్నారు. అందులో భాషా పరిజ్ఞానం ఒకటి. చిన్నారులకు మాటలు నేర్పించడం, పదాలను పలికించడం, బొమ్మలను చూపించి వాటి పేర్లు చెప్పించడం, చార్ట్స్, గ్రాఫ్స్ చేయించడంతో మానవీయ చిత్రాలతో బోధన చేస్తున్నారు.
- ప్రత్యేక అవసరాలవి రెండో రకం సేవలు. మానసిక దివ్యాంగులు తమ పనులను సక్రమంగా చేసుకోలేరు. చిన్నారులు స్నానం చేసేలా, బ్రష్ చేసుకునేలా, దువ్వెనతో తల దువ్వుకునేలా, దుస్తులు ధరించేలా, వ్యక్తిగత అవసరాలను తీర్చుకునేలా శిక్షణ ఇస్తున్నారు.
- మూడో రకం సేవ ఫిజియోథెరపీ. శారీరక దివ్యాంగుల్లో అనేక మందికి కాళ్లు, చేతులు, ఇతర అవయవాలు సక్రమంగా పనిచేయకపోవడంతో నడవడానికి ఇబ్బందులు పడతారు. అలాంటి వారికి ఇక్కడ ఫిజియోథెరపీ చేస్తున్నారు. వారి అవయవాలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంగా 65 మందికి తర్ఫీదు ఇవ్వడంతో 20 మంది సహజ స్థితికి వచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053, జగదేవపూర్ 8008573209, హుస్నాబాద్ 8008573520, దుబ్బాక 9030037175, చేర్యాల 8008574871, గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, మిరుదొడ్డి, బెజ్జంకి

? మిరుదొడ్డి ఆరో వార్డులో ప్రధాన మురుగు కాలువ పై పైకప్పులు కూలి ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –రాజు మిరుదొడ్డి

✔ ఇనుప చువ్వలు తేలిన మురుగు కాలువ పైకప్పును సరి చేస్తాం. ప్రమాదాలను నివారిస్తాం. –షహీం, కార్యదర్శి, మిరుదొడ్డి

? మిరుదొడ్డి మండలం అల్వాల కూడలిలో ఆకాశ దీపాలు వెలగడం లేదు. రాత్రి చీకటిగా ఉంటోంది. – కిష్టయ్య, అల్వాల

✔ సమస్యను పరిశీలించి.. ఆకాశ దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. –రవి, గ్రామ కార్యదర్శి, అల్వాల

? మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో సకాలంలో చెత్త సేకరించక పేరుకుపోతోంది. పరిసరాలు అపరిశుభ్రంగా కన్పిస్తున్నాయి. –రాజు, యువజన సభ్యుడు.

✔ పంచాయతీ పరిధిలో పలు పనుల కారణంగా ట్రాక్టర్ అందుబాటులో లేకుండా పోతోంది. ఇంటింటి చెత్త సేకరణలో జాప్యం జరుగుతోంది. సమస్య పరిష్కరిస్తాం. –ప్రణీత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

జిల్లా కాంగ్రెస్ కమిటీలో ప్రాధాన్యం

చేర్యాల: సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీలో చేర్యాల ప్రాంతానికి అధిష్ఠానం ప్రాధాన్యతనిచ్చింది. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌కి చెందిన మేరుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చేర్యాల పట్టణానికి చెందిన పుర్మ ఆగంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేర్యాల మండలం వీరన్నపేటకి చెందిన మంజ మల్లేశం నియామకయ్యారు. ఈ మేరకు సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారికి అందజేశారు.

నంగునూరు, దౌల్తాబాద్‌లో పథ సంచాలన్

నంగునూరు, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నంగునూరులో స్వయం సేవకులు పథ సంచాలన్ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యవాహ్ బొల్లి నర్సింలు మాట్లాడారు. విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన భారతదేశంలో పుట్టడం మనం అందరం అదృష్టంగా భావించాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దౌల్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో పథ సంచాలన్ నిర్వహించారు. మెదక్ జిల్లా విభాగ కార్యవాహ్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



నంగునూరులో..

రైతులూ అప్రమత్తంగా ఉండాలి

రాయపోల్, న్యూస్‌టుడే: రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హైమద్ హుస్సేన్ అన్నారు. 'మళ్లీ పులి కలకలం' అంటూ సోమవారం 'ఈనాడు'లో వార్త రావడంతో మంగళవారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి వచ్చిన అధికారులు గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. పొలాల వద్దకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గ్రామంలో దండోరా వేయించారు. పులి జాడ తెలుసుకునేందుకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తా

సిద్దిపేట టౌన్: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తానని కడారి అనంతరెడ్డి అన్నారు. సిద్దిపేటలోని సరస్వతీ శిశుమందిర్‌లో మంగళవారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తానని పేర్కొన్నారు. మద్దతు ఇవ్వాలని కోరారు. ట్రెస్మా పట్టణాధ్యక్షుడు మోహన్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

సిద్దిపేట టౌన్: శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ స్పష్టం చేశారు. టూటౌన్ పరిధిలోని కరీంనగర్ రోడ్‌లోని దాబాల్లో ప్రజాశాంతికి భంగం కల్గిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూసెన్స్‌కు పాల్పడ్డ తొమ్మిది మందిపై ఈపెట్టి కేసులు నమోదు చేశామన్నారు. కేసీఆర్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో స్థానాలు కేటాయించండి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుమ్మరులు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అఖిల భారత కులాల కుంభార్ ప్రజాపతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. రాజకీయంగా ఎదగడానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరులకు స్థానాలు కేటాయించాలని కోరారు. సిద్దిపేటలో సంఘం రాష్ట్రస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వేలాద్రి, సత్యం, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

కోహెడ: 'ఇలాగైతే దాహం తీరేదెలా' అనే శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన చిత్ర కథనానికి ఎంపీడీవో కృష్ణయ్య స్పందించారు. సముద్రాల కార్యదర్శి తిరుపతికి ఫోన్ చేసి తక్షణమే చేతిపంపు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పాడైన పరికరాలు తీసేసి కొత్తవి వేసి బాగు చేశారు.

ఆరబోతకు ముందే.. సంచులు పరిచే..



కోహెడ మండలంలోని శనిగరం ధాన్యం కొనుగోలు సమీపంలో ధాన్యం ఆరబోత కోసం ముందుగానే ఇలా సంచులు పరిచి ఇది తమదని రిజర్వు చేసుకుంటున్నారు రైతులు. పలు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే గింజ దశకు పంటలు చేరుతున్నప్పటికీ కొన్ని చోట్ల వరి కోతలు ప్రారంభించారు. ఇదిలా ఉంటే కొంతమంది రైతులు ముందుగానే ఆలోచనకు వచ్చి తమ పంట కోసే సమయానికి కొనుగోలు కేంద్రం వద్ద స్థలం ఉంటుందో లేదో అని భావించి ఇలా సంచులు పరిచి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. –న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

వానరాల గోల.. రక్షణకు వల



చౌటపల్లికి చెందిన ఆవుల వెంకటరాజు తన ఇంటిని కోతుల నుంచి కాపాడుకునేందుకు పైన ఇలా వల కట్టారు. దీనికి తోడు 2 శునకాలను కొనుగోలు చేసి కాపలా ఉంచుతున్నారు. వల కోసం రూ.10 వేలు, శునకాల కోసం రూ.28 వేలు వెచ్చించినట్లు చెబుతున్నారు. పాత ఇల్లు కోతుల వల్లే దెబ్బతిందన్నారు. దాన్ని వదిలేసి మరో ఇల్లు కొని మరమ్మతులు చేసుకుంటే ఇక్కడా కూడా వాటి గోల తప్పడం లేదని వాపోయారు. పైన వల, కింద రెండు కుక్కలు కాపలా ఉండడంతో వానరాలు రావడం లేదంటున్నారు. –న్యూస్‌టుడే, అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం)

ఏడాదిగా మెట్ల కిందే ట్రీగార్డులు




వన మహోత్సవంలో నాటిన మొక్కలకు మేకలు, పశువుల నుంచి రక్షణ కల్పించేందుకు ఊరూరా 'రక్షణ వలలు(ట్రీ గార్డు)' లు కొనుగోలు చేశారు. చేర్యాల మండలం ఆకునూరులోనూ పంచాయతీ ఆధ్వర్యంలో తీసుకొచ్చారు. ఒక్కో దానికి రూ.50 చొప్పున ఖర్చు చేసి సుమారు వెయ్యికి పైగా తెచ్చి ఇలా పంచాయతీ భవనం వెనకాల మెట్ల కింద పడేశారు. ఏడాదిగా అక్కడే ఉన్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పులి బాలయ్యను వివరణ కోరగా.. గత ఏడాది నాటిన మొక్కలకు చుట్టూ ముళ్లకొమ్మలు పాతించామన్నారు. అందువల్ల వాటిని వినియోగించలేదన్నారు. ఈసారి నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, చేర్యాల

భాజపా సంబురాలు

గజ్వేల్, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా విజయం సాధించటం పట్ల గజ్వేల్‌లో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. పట్టణాధ్యక్షుడు మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి వద్ద టపాసులు కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్ర నాయకులు జశ్వంత్‌రెడ్డి, రాములు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు



గజ్వేల్‌లో అన్నపూర్ణాదేవిగా..



మర్పడ్గ: శ్రీమహాలక్ష్మీగా..



ప్రజ్ఞాపూర్‌లో కుంకుమార్చన



చేర్యాల చావిడిలో అమ్మవారికి విద్యుత్తు దీపాల అలంకరణ



రామక్కపేటలో..

చేర్యాల, జగదేవపూర్, మిరుదొడ్డి, గజ్వేల్, కొండపాక గ్రామీణం, దుబ్బాక, గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా కొనసాగుతున్నాయి. చేర్యాల చావిడి వద్ద 'దేవి స్నేహ యూత్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో మంగళవారం అమ్మవారికి శివుడి త్రిశూలం ఆకారంలో విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఆయ్యప్ప స్వామి ఆలయంలోని అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆకునూరు భవానీ రుద్రేశ్వరాలయంలో అమ్మవారిని చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్సై నీరేశ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జగదేవపూర్‌లో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అక్బర్‌పేట భూంపల్లి మండలం మోతే శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, కొండపాక మండలం మర్పడ్గలో రోజున విజయదుర్గామాత శ్రీమహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కింగ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. దుబ్బాకలోని పలు మండపాల వద్ద కుంకుమార్చనలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

ఒక్కేసి పువ్వేసి ఉయ్యాలో..

సిద్దిపేట టౌన్, గజ్వేల్ గ్రామీణ: సిద్దిపేటలో బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మోడ్రన్ రైతుబజార్ వద్ద మహిళా రైతులు, కూరగాయల విక్రయదారులు, అధికారులు, సిబ్బంది కూరగాయలతో బతుకమ్మను తయారు చేసి ఆడిపాడారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆర్డీవో సదానందం, తహసీల్దార్ సలీమ్, కార్యాలయ అధికారులు సంబరాల్లో పాల్గొన్నారు. ప్రజ్ఞాపూర్ ద్వారక వెంచర్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కొండపాక గ్రామీణం, చేర్యాల: కొండపాక, దమ్మక్కపల్లి, తపాసులపల్లిలో ఆనవాయితీగా ఏడు రోజుల్లోనే సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాయంత్రం గ్రామ కూడళ్లలో ఆడిపాడారు. అనంతరం ఊర చెరువుల్లో నిమజ్జనం చేశారు. మాజీ ఎంపీపీ మంచాల అనసూయ, తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట: రైతుబజార్ ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిద్దిపేట: బతుకమ్మ ఆడుతున్న ఆర్డీవో సదానందం, తహసీల్దార్ సలీమ్, అధికారులు



కొండపాక మండల కేంద్రంలో..



గజ్వేల్ ద్వారక వెంచర్‌లో..

వాహనం ఢీకొని.. చికిత్స పొందుతూ కూలీ మృతి

వర్గల్, న్యూస్‌టుడే: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న కూలీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలంలో జరిగింది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శాకారం గ్రామానికి చెందిన పంగ సత్తయ్య (50) కూలీగా పని చేస్తున్నాడు. భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆదివారం రాత్రి వర్గల్ నుంచి శాకారం వైపు నడుచుకుంటూ వస్తున్నాడు. మీనాజీపేట గ్రామానికి చెందిన బర్రెల నర్సింలు తన ద్విచక్ర వాహనంపై వస్తూ సత్తయ్యను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఇద్దరికీ గాయాలయ్యాయి. ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సత్తయ్య మృతి చెందాడు. కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కోహెడకు చెందిన మైసయ్య..

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడకు చెందిన బసవరాజు మైసయ్య (45) ఈ నెల 18న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మైసయ్య చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మైసయ్య మద్యానికి బానిసై మృతి చెందినట్లు ఆయన భార్య ఫిర్యాదు చేశారని ఎస్సై అభిలాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

జగదేవపూర్: మండల పరిధి అలిరాజపేట చౌరస్తా వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్కుక్ మండలం నర్సన్నపేటకు చెందిన ఎంబరి బాలనర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు గ్రామస్థులు తెలిపారు.

త్రుటిలో తప్పిన ముప్పు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన ర్యాగళ్ల దుర్గయ్య స్నేహితులతో కలిసి మంగళవారం రాజీవ్ రహదారిపై కుకునూరుపల్లికి వెళ్తున్నారు. కారు తిమ్మారెడ్డిపల్లి శివారులోకి చేరుకోగానే వెనకాల అతివేగంగా అజాగ్రత్తగా దూసుకొచ్చిన వ్యాన్ వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు అద్దాలు పగలి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పంగా గాయపడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కారును ఢీకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పీఆర్‌టీయూ కార్యవర్గంలో చోటు

హుస్నాబాద్: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో అక్కన్నపేట మండలం నుంచి సర్దార్‌కు చోటు దక్కింది. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎండీ సర్దార్ ఎన్నికయ్యారు. మంగళవారం రాజధానిలో జరిగిన సంఘం 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తొగుట, న్యూస్‌టుడే: తొగుట మండలం వెంకట్రావుపేటకు చెందిన నాగమణి, స్వప్న, రజిత, స్వాతిలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం మండల భారాస అధ్యక్షుడు రాంరెడ్డి పంపిణీ చేశారు. చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన డిజిటల్ కార్డు సర్వే

హుస్నాబాద్: పుర పరిధిలోని 11వార్డులో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డులకు సంబంధించి నాలుగు బృందాలతో 336 కుటుంబాల సర్వే నిర్వహించారు. మంగళవారం కార్యక్రమం ముగిసింది. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.

క్షేత్రపర్యటనలు కీలకం

సిద్దిపేట టౌన్: విద్యార్థుల్లో పౌరబాధ్యత పెరగడానికి క్షేత్రపర్యటనలు ఎంతగానో దోహదపడతాయని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.సునీత అన్నారు. భారతీయ కళామహోత్సవంలో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. ఈ మేరకు పర్యటన విషయాలను ప్రిన్సిపల్ సునీత మంగళవారం వెల్లడించారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

తాళ్లకుంటను కాపాడాలని వినతి



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఐనాపూర్ రైతులు

చేర్యాల: అక్రమార్కుల చెర నుంచి తాళ్లకుంటను కాపాడాలని కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు మాజీ సర్పంచి ఎరుకు రమణారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రతి యేటా బతుకమ్మలను ఇదే కుంటలో నిమజ్జనం చేస్తున్నామని, అయితే కొందరు ఈ కుంట శిఖంలో కబ్జా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, బాలయ్య, మల్లం శ్రీనివాస్, ఆగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, సరకుల పంపిణీ

జగదేవపూర్: అలిరాజపేటలోని ఎస్‌సీవీ స్వచ్ఛంద సంస్థ పోషణలో ఉన్న పలువురు పిల్లలకు దసరా పండగ సందర్భంగా నూతన దుస్తులు, వృద్ధులకు నిత్యావసర సరకులు, దుప్పట్లను జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎంబరి రాంచంద్రం మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి ఏటా దసరా పండుగకు సాయం చేస్తున్నారన్నారు.

అంతర పంటల పరిశీలన

సిద్దిపేట అర్బన్: మిట్టపల్లిలో యాదగిరి తన పొలంలో కందిలో అంతర పంటగా సాగు చేసిన రాగి పంటను ఏవో శ్రీనాథ్ మంగళవారం పరిశీలించారు.

11 మంది జూదరుల అరెస్టు

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి పోలీసు స్టేషన్ పరిధి నాగపురి శివారులో టాస్క్‌ఫోర్స్, కొమురవెల్లి పోలీసులు సంయుక్తంగా జూద శిబిరంపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఐదుగురు వ్యక్తులు పట్టుబడగా, మరో ఆరుగురు పారిపోయారన్నారు.. రూ.60,270 నగదుతో పాటు 6 చరవాణులు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

'అనుచిత వ్యాఖ్యలపై ఠాణాలో ఫిర్యాదు'

బెజ్జంకి: వాట్సాప్ గ్రూప్‌లో బీసీ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల శ్రీనివాస్, నాయకులు మంగళవారం బెజ్జంకి ఠాణాలో ఫిర్యాదు చేశారు. జిల్లాలోని ఓ ప్రాంతంలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించామని, ఆ వివరాలను వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేస్తే ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు మంగళవారం జిల్లా సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.8,000జరిమానా విధించారు.

చోరీ కేసులో ఒకరికి జైలు

వేములవాడ: చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ వేములవాడ కోర్టు జడ్జి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు. వేములవాడ పట్టణంలోని కోనాయిపల్లికి చెందిన దుర్గం ప్రవీణ్‌కి చెందిన ద్విచక్రవాహనాన్ని 2024 ఏప్రిల్‌లో సిద్దిపేట జిల్లా సర్వాయిగుడి మెచిగపల్లి గ్రామానికి చెందిన బానాల గణేశ్ దొంగిలించినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి అయిదు నెలల కారాగార శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.